




రంజాన్ వేళలు
ఇఫ్తార్ - మంగళవారం
సాయంత్రం - 6:34
సహర్ - బుధవారం
ఉదయం - 4:46



- అసెంబ్లీ ఎన్నికల్లో నెల ముందే హంగామా
- లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులు ఖరారైనా ప్రచారం కరువు
- అంతర్మథనంలో నాయకులు, కార్యకర్తలు
- సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్
- ప్రచారం ప్రారంభించిన బీజేపీ

"లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో క్షేత్రస్థాయిలో ప్రధాన రాజకీయ పార్టీల్లో సందడి కరువైంది. గత ఏడాది నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల్లో ఉన్న జోష్ ఈ ఎన్నికల్లో ఇంకా కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఖరారై పది రోజులు గడిచిపోయినా ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం లేదు. తమ పార్టీ అభ్యర్థి నుంచి తమకు ఇంకా ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఆయా పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. అంతేకాకుండా ఇప్పటి నుంచే గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తే ఖర్చు తడిసి మోపడవుతుందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

కనిపించని సందడి

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చినా కదలని నేతలు

వికారాబాద్/మేడ్చల్ (ఆంధ్రజ్యోతి ప్రతినిధి), ఏప్రిల్ 1 : కేంద్రంలో ఏ పార్టీ అధికారంలోకి రావాలని నిర్ణయించే లోక్‌సభ ఎన్నికలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతూ ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో ఇంకా ఆ సందడి కానరావడం లేదు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం పట్టణాలు, మండల కేంద్రాలకే పరిమితం కావడంతో పల్లెల్లో ఎన్నికల సందడి ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. వచ్చేనెల 13వ తేదీన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అభ్యర్థిత్వం ఖరారు కాగానే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేసే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున మాజీ జడ్పీ చైర్‌పర్సన్ కాసానిజ్ఞానేశ్వర్ పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. మల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి కాంగ్రెస్ తరఫున పట్నం సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ తరఫున ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడి బరిలో నిలిచిన విషయం విదితమే. అభ్యర్థులు ఖరారై పది రోజులు గడిచిపోయినా ప్రధాన పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఓటర్ల వద్దకు రావడం లేదని, కనీసం తమకే ఓటు వేయాలని కూడా కోరడం లేదంటూ ప్రజలు వాపోతున్నారు. గత నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా సెప్టెంబరు నెల నుంచే ముందస్తు ఎన్నికల ప్రచారం కొనసాగుతూ వచ్చింది. రెండు నెలల పాటు కొనసాగిన ఎన్నికల ప్రచారంతో పట్టణాలు, గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొన్న విషయం తెలిసిందే. ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులు అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించినా.. కొన్ని గ్రామాల్లో ఒకటికి రెండుసార్లు కూడా ప్రచారం నిర్వహించగలిగారు.

కనిపించని ఉత్సాహం

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల తరఫున మండల స్థాయి నాయకులు ప్రచార బాధ్యతను తమ భుజాన వేసుకుని విస్తృతంగా ప్రచారం చేస్తూ ఇంటింటికి తిరిగి ఓట్లు వేయాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తల్లో కనిపించిన జోష్ లోక్‌సభ ఎన్నికల్లో ఇంకా కనిపించడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు, ఇప్పుడు కొనసాగుతున్న లోక్‌సభ ఎన్నికలకు మధ్య వ్యత్యాసం చూసి నాయకులు, కార్యకర్తలు, ముఖ్యంగా ఓటర్లు ఆశ్చర్యపోతున్నారు. ఇంతకు ముందు జరిగిన ఎన్నికల్లో ఓట్ల కోసం తమ చుట్టూ తిరిగిన నేతలు ఇప్పుడు తమ గురించి పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అక్టోబరు, నవంబరు నెలల్లో పట్టణాలు, గ్రామాల్లో రోజూ విందు భోజనాలు, మద్యం పార్టీలు కొనసాగాయి. నాయకులు ఓటర్లను పోటాపోటీగా కలిసి తమ పార్టీకే మీ ఓటు వేయాలని అభ్యర్థించేవారు. కనిపించిన ప్రతి ఓటరును గౌరవంగా పలకరించేవారు. ఎన్నికలపైనే ఆధారపడిన సీజన్ నాయకులు ప్రస్తుత పరిస్థితిని చూసి కంగుతింటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు, లోక్‌సభ ఎన్నికలకు పరిస్థితి మారడంతో విస్తుపోతున్నారు. తమకు అనుకూలంగా ఓట్లు వేయించాలని వ్యక్తిగతంగా కోరే వారే కరవయ్యారంటూ వారు వాపోతున్నారు. గత ఎన్నికల్లో కనిపించిన ఉత్సాహం నాయకులు, కార్యకర్తల్లో ఇంకా కనిపించడం లేదు.

ఖర్చుకు భయపడి...

ఇదిలా ఉంటే, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రెండు నెలలకు లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉండడంతో నామినేషన్ల పర్వం ప్రారంభమైన తరువాత పార్టీ శ్రేణులకు చేరువకావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి నుంచే గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తే.. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అయ్యే ప్రచార ఖర్చు తడిసి మోపడవుతుందని భావించి వెనక్కి తగ్గినట్లు చెబుతున్నారు. ఈ నెల చివరివారం నుంచి గ్రామాలు, పట్టణాల్లో స్థానికంగా ఉండే నాయకులు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

ఎవరికి వారే...

ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచార సభలు నిర్వహించే సమయంలోనే నాయకులు, కార్యకర్తలు వెంట కనిపిస్తున్నారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమవుతున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా, వికారాబాద్ జిల్లా పరిధిలో మూడు, రంగారెడ్డిజిల్లా పరిధిలో నాలుగు నియోజకవర్గాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతమైన వికారాబాద్ జిల్లా పరిధిలో తాండూరు, వికారాబాద్, పరిగి నియోజక వర్గాలు ఉండగా, మిగతా చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు హైదరాబాద్ చుట్టూ ఉన్నాయి. మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్‌బీ నగర్, కంటోన్మెంట్, మల్కాజ్‌గిరి నియోజకవర్గాలున్నాయి. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజక వర్గాల్లో ఎక్కువ సంఖ్యలో ఓటర్లు ఉండడంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు కూడా ఆ నియోజకవర్గాలపై ఎక్కువగా దృష్టి సారించారు.




తక్కువ ఓట్లు వచ్చిన ప్రాంతాలపై నజర్!

చేవెళ్ల లోక్‌సభకు కాంగ్రెస్ అభ్యర్థిగా సిటింగ్ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, బీజేపీ తరఫున మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున కాసాని జ్ఞానేశ్వర్‌ల అభ్యర్థిత్వం ఖరారైన విషయం తెలిసిందే. మల్కాజ్‌గిరి లోక్‌సభ నుంచి కాంగ్రెస్ తరఫున పట్నం సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ తరఫున ఈటల రాజేందర్, బీఆర్ఎస్ తరఫున రాగిడి లక్ష్మారెడి బరిలోనిచిన విషయం విదితమే. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తుండగా, బీజేపీ అభ్యర్థి మండలాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఎన్నికల్లో విజయానికి అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై ఎప్పటికప్పుడు మార్గదర్శనం చేస్తూ ముందుకు సాగుతున్నారు. గత మూడున్నర నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన ప్రగతిపైన ఆపార్టీ ఆశలు పెట్టుకోగా, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి తక్కువ ఓట్లు వచ్చిన గ్రామాలు, ప్రాంతాలపై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎంతో ఉత్సాహంగా ప్రచారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల్లో అప్పటి జోష్ ఈఎన్నికల్లో ఇంకా కనిపించడం లేదు. తమ పార్టీ అభ్యర్థి నుంచి తమకు ఇంకా ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు.

భగభగ..!

మేడ్చల్ జిల్లాలో అత్యధికంగా 41.9 డిగ్రీలు నమోదు



మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పరిగి, ఏప్రిల్1 : ఎండలు దంచి కొడుతున్నాయి. ఉదయం 8గంటలకే భానుడు భగ్గుమంటున్నాడు. మధ్యాహ్న సమయంలో నిప్పులు కురిపిస్తుండటంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. వారంరోజుల క్రితం మామూలుగానే ఉన్న ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో జనం తట్టుకోలేక పోతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సోమవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లా కేపీహెచ్‌పీలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి పరిధి టీపీఎస్‌నగర్‌లో 41.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 1 : పోలింగ్ విధుల పట్ల, ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలింగ్ విధుల నిర్వహణపై జిల్లా, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రిసైడింగ్ అధికారుల హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలన్నారు. పోలింగ్‌కు ముందు మాక్ పోల్ నిర్వహించాలన్నారు. ఓటింగ్ గోప్యత నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలో 2, 3 తేదీల్లో బాయ్స్ జూనియర్ కళాశాల, పరిగి నియోజకవర్గంలో అవే రోజుల్లో జిల్లా పరిషత్ బాయ్స్ స్కూల్, తాండూరులో 3,4 తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొడంగల్ నియోజకవర్గంలో అదే అదే తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవోలు, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో సుధీర్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధిలో జిల్లాకు మొదటి స్థానం గర్వకారణం

ఈ ఏడాది ఉపాధి హామీ పథకం క్రింద అన్ని ఫారా మీటర్స్‌ను క్లియర్ చేసి రాష్ట్రంలో వికారాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ఉపాధి పథకం కింద చేపట్టే పనులు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉపాధి పనుల్లో కూలీల సంఖ్యను పెంచుతూ జాబ్ కార్డు ఉన్నప్రతి ఒక్కరికీ పని చూపాలని అన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసే బాధ్యత పంచాయతీ సెక్రటరీ, మండల స్పెషల్ అధికారులదేనన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని జంతువులకు తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. కూలీల సంఖ్యను పెంచి గ్రామానికి ఉపయోగపడే పనులను 100 శాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు ఉండేలా పంచాయతీ సెక్రటరీలు చూడాలన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఫ్లెక్సీల తొలగింపు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 1 : 'ఇక్కడ కోడ్ వర్తించదా?' అంటూ ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఘట్‌కేసర్ మున్సిపల్ అధికారులు స్పందించారు. బొక్కోనిగూడలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. బొక్కోనిగూడలో ఇటీవల జరిగిన అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆయా పార్టీల నాయకులకు స్వాగతం పలుకుతూ రోడ్డు కిరువైపుల పెద్దఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఇందులో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు పోటాపోటీగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన మున్సిపల్ అధికారులు సోమవారం ఉదయమే ఫ్లెక్సీలను తొలగించి మున్సిపల్ కార్యాలయానికి తరలించారు.

61.33%

మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూలు

- ప్రథమ స్థానంలో వికారాబాద్.. చివరిస్థానంలో తాండూరు
- జీఎస్‌డీపీ లక్ష్యాన్ని చేరుకోని తాండూరు మున్సిపాలిటీ
- కేంద్ర నిధులు రావడం కష్టమే
- వృద్ధిరేటును సాధించిన వికారాబాద్, పరిగి, కొడంగల్



తాండూరు, ఏప్రిల్ 1: ఈ ఏడాది ఆస్తి పన్ను వసూళ్ల గడువు ముగిసింది. వికారాబాద్ జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలో కలిసి ఈ యేడాది 2023-2024 మార్చి 31 వరకు 61.33 శాతం ఆస్తి పన్ను వసూలైయింది. గతేడాది నాలుగు మున్సిపాలిటీల్లో కలిసి రూ. 10కోట్ల 65 లక్షలు వసూలు చేయగా ఈ యేడాది రూ. 10 కోట్ల 47 లక్షలు వసూలు చేశారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి 31 వరకు ఆర్థిక సంవత్సరంలో 100శాతం ఆస్తి పన్ను లక్ష్యం కాగా, 90శాతం వడ్డీ రాయితీని కూడా ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. దీంతో మార్చి నెలలో బకాయిలు ఎక్కువగా వసూలయ్యాయి. ఈయేడాది (2023-2024) ఆర్థిక సంవత్సరంలో పన్నువసూళ్లలో వికారాబాద్ మున్సిపాలిటీ ప్రథమస్థానంలో నిలిచింది. కొడంగల్ మున్సిపాలిటీ మూడో స్థానంలో నిలిచింది. వికారాబాద్ మున్సిపాలిటీ జిల్లాలోనే 91.02శాతం సాధించగా పరిగి మున్సిపాలిటీ 79.02 శాతం సాధించి ద్వితీయస్థానంలో నిలవగా, కొడంగల్ మున్సిపాలిటీ74.40శాతంతో మూడోవ స్థానం, తాండూరు మున్సిపాలిటీ 44.15శాతంతో చివరి స్థానంలో నిలిచింది.

గతేడాది..

గతేడాది (2022-23) తాండూరు మున్సిపాలిటీ రూ. 4కోట్ల 10 లక్షల 65వేలు పన్నులు వసూలు చేయగా ఈ ఏడాది (2023-24)లో రూ. 4కోట్ల 30 లక్షల 10వేలు వసూలు చేసింది. గతేడాది కంటే ఈ యేడాది విస్తృత ప్రచారం రెడ్ నోటీసులు జారీ చేసిన రూ. 19లక్షలు మాత్రమే అధికంగా వసూలు చేశారు. ఈ ఏడాది పూర్తి స్థాయిలో కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్ , రెవెన్యూఇన్‌స్పెక్టర్, కలెక్టర్ ఉన్నప్పటికీ ఆస్తిపన్నులు ఆశించినంత వసూలు కాలేదు. ఈ ఏడాది జీఎస్‌డీపీ (వృద్ధిరేటు) లక్ష్యాన్ని సాధించబడకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిధులు రావడం కష్టమే. జిల్లాలోని వికారాబాద్ మున్సిపాలిటీ గతేడాది రూ. 3 కోట్ల 56 లక్షల 56వేలు వసూలు చేయగా ఈ యేడాది రూ. 3కోట్ల 34లక్షల 9వేలు సాధించి వృద్ధిరేటును సాధించింది. పరిగి మున్సిపాలిటీ గతేడాది కోటి 38లక్షల 85వేలు రాగా, ఈ ఏడాది రూ. కోటి 11లక్షల 83వేలు వసూలు చేసి వృద్ధిరేటు సాధించింది. తాండూరు మున్సిపాలిటీ గతేడాది రూ. 4 కోట్ల 40 లక్షల 65వేలు వసూలు చేయగా ఈ ఏడాది రూ. 4 కోట్ల 30 లక్షల 10వేలు వసూలు చేసింది. అయిన ప్పటికీ కేంద్ర ప్రభుత్వం నిర్ధారించిన లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా రూ. 40 లక్షల పైనా ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. జీఎస్‌డీపీ గతేడాది ముందుగానే చేరుకోగా, ఈసారి వెనుకబడి పోయింది.



పన్ను వసూళ్ల వివరాలు

మున్సిపాలిటీ	డిమాండ్ (రూ. కోట్లలో)	వసూలు (రూ. కోట్లలో)	శాతం
వికారాబాద్	367.06	334.09	91.02
తాండూరు	972.59	430.10	44.15
కొడంగల్	149.24	111.04	74.40
పరిగి	217.44	171.83	79.02
మొత్తం	1706.33	1047.06	61.33

తాగునీటి సరఫరాకు చర్యలు

- కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, ధాన్యం కొనుగోలు, పాఠశాల మౌలిక వసతుల కల్పనపై సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా జరుగుతున్నదని, ప్రతి గ్రామానికి నీటి సరఫరా కార్యచరణ రూపకల్పన చేశామన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో మద్దతు ధరపై కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని, పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారాపూర్తి చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎండల నేపథ్యంలో వడదెబ్బ నియంత్రణకు చర్యలు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. డీఈఓ విజయకుమారి, డీఎంహెచ్‌ఓ రఘునాధస్వామి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ , అధికారులు

టోల్‌ఫ్రీ నంబర్ 1950..

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఓటర్ల వివరాలకు కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నంబర్ 1950 ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సోమవారం తెలిపారు. కంట్రోల్‌రూమ్‌లో సిబ్బంది, పోలింగ్ స్టేషన్ల నంబర్‌లు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని ఓటర్ల వివరాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఫారం 6,7,8 సంక్షిప్త సమాచారం , ఓటర్ ఐడీ వివరాలు, పోలింగ్ స్టేషన్ల వివరాలు, ఎపిక్ కార్డు వివరాలు, ఏఆర్‌వో, ఈఆర్, బీఎల్‌వో, సూపర్‌వైజర్స్ తదితర వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ధాన్యం కొనుగోళ్లు షురూ!

- యాసంగి లక్ష్యం 1.19 లక్షల మెట్రిక్ టన్నులు
- తొలిరోజు ఎనిమిది కేంద్రాల్లో ప్రారంభం



వికారాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : వికారాబాద్ జిల్లా యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సీజన్‌లో 1.19 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించింది. ధాన్యం కొనుగోలు చేసేందుకు 122 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా, సోమవారం తొలిరోజు 8 కేంద్రాలు ప్రారంభించారు. గత రబీ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యంలో సగం వరకు కొనుగోళ్లు చేయగలిగారు. రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోలిస్తే వికారాబాద్ జిల్లాలో వరి నాట్లు ఆలస్యంగా వేయడంతో కోతలు ఆలస్యంగా ప్రారంభమవుతాయి. ఫలితంగా ఇతర జిల్లాలతో పోలిస్తే ధాన్యం సేకరణ ఆలస్యంగా ప్రారంభమై ఆలస్యంగా ముగియనుంది. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ నెలాఖరు వరకు అన్ని కేంద్రాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బస్తాల సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు తగు ముందస్తు చర్యలు చేపట్టారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు డిమాండ్ మేరకు గన్నీ బస్తాలు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టారు. అంతే కాకుండా గన్నీ బస్తాలను గోదాముల్లో అందుబాటులో ఉంచారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం నిల్వలు రోజురోజుకూ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎక్కడ కూడా గన్నీ బస్తాల సమస్య ఎదురు కాకుండా అధికారులు ముందుగానే సిద్ధంగా ఉంచారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న విద్యావంతుల వేదిక నాయకులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 1: ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్ల అన్నిరకాల బిల్లులను చెల్లించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్‌గౌడ్, గౌరారం గోపాల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్‌లింగంపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. 15 వాయిదాల పీఆర్సీ బకాయిలు, సరెండర్ సెలవుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. 2023 సంవత్సరంలో ఎస్ఎస్‌సీ స్పాట్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వేతనం చెల్లించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను ఏప్రిల్ 23వ తేదీన రిలీవ్ చేయాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం వరకు ప్రతీ పాఠశాలలో స్కావెంజర్‌లను నియమించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల్లో విద్యావలంటీర్‌లను నియమించాలన్నారు.

పార్టీకోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు


నర్సాగౌడ్‌ను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 1: కొత్తగా పార్టీలో చేరి కష్టపడి పనిచేసే వారికి తప్పని సరిగి గుర్తింపు లభిస్తుందని మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం మేడ్చల్ మండల మాజీ ఎంపీపీ నర్సింహగౌడ్ ఈటల రాజేందర్ సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలు నేడు బీజేపీ పార్టీని అధరిస్తుందన్నారు. మల్కాజ్‌గిరి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానని తెలిపారు. ప్రత్యేకంగా తనకు అండగా నిలిచన మేడ్చల్ ప్రజలకు ఎంతగానో రుణపడి ఉన్నానని తెలిపారు. తన విజయం కోసం పని చేసే ప్రతి ఒక్కరికి పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ పార్టీలో ఎవ్వరొచ్చిన స్వాగతిస్తామని తెలిపారు. సమీప కాలంలో బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలకు చెందిన చాలా మంది నాయకులు తమ పార్టీలో చేరనున్నారని ఈటల తెలిపారు. నర్సింహ్మగౌడ్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గౌడవెల్లి గోవర్ధన్ గౌడ్ అలియాస్ గోవా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పూడూరు మాజీసర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రేపు వికారాబాద్‌కు కేటీఆర్ రాక

వికారాబాద్, ఏప్రిల్ 1: జిల్లా కేంద్రానికి బుధవారం(రేపు) మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత సమావేశంలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి కేటీఆర్‌తో పాటు సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి హాజరవుతారన్నారు. వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే ఈసమావేశానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.









వికారాబాద్‌లో ఈ ఇఫ్తార్

- పాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి
- పెద్ద ఎత్తున తరలివచ్చిన మైనార్టీలు

వికారాబాద్, ఏప్రిల్ 1: రంజాన్ పండుగను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి మైదానంలో దావత్ ఈ ఇఫ్తార్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. నవాబ్ మహమూద్ ఆలంఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ రంజిత్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకకు మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొని ఉపవాస దీక్షను విరమించారు ఈ వేడుకల్లో ముజాహిద్ ఆలంఖాన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అజమతుల్లా ఖాన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఫహీంబాయ్, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి నాయకులు సుధాకర్ రెడ్డి, కిషన్ నాయక్, ఎర్రవల్లి జాఫర్, వాహీద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఆయూబ్ అన్సారీ, ముత్తహర్ షరీఫ్, వెంకట్‌రెడ్డి, పరశురామ్‌నాయక్, శ్రీనివాస్ ముదిరాజ్, రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆసిఫ్, సర్వరాజ్, కరీం, రహీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 1: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని తాగునీటి సరఫరాపై వివిధ కాలనీలను సోమవారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తాగునీటికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా బోర్‌వెల్స్, చేతిపంపులను మరమ్మతులు చేపట్టే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. మునిసిపల్ పరిధిలోని బీటీఎస్ కాలనీలో పర్యటించి గ్రామంలో పర్యటించే క్రమంలో పంప్ హౌస్‌ను పరిశీలించారు. ఎక్కడా మురుగునీరు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్‌లు ఉన్నారు.

ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలి

ధారూరు: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా బోర్‌వెల్‌లను, చేతిపంపులను ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని కేరెల్లి, ఎబ్బనూర్ గ్రామాలను సోమవారం ఆయన సందర్శించి చేతిపంపులు, బోర్‌వెల్స్ పనితీరును, మిషన్ భగీరథ నీటి సరఫరాను పరిశీలించారు. గ్రామంలో మిషన్ భగీరథ నీరు ఎంత సరఫరా అవుతుందని, భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే తాగునీటి సరఫరా ఎలా చేస్తున్నారని ఆయన కార్యదర్శులను ప్రశ్నించారు. మిషన్‌భగీరథ నీటి సరఫరా అవుతుందని, అంతరాయం ఏర్పడితే చేతిపంపులు, సింగిల్‌ఫేజ్ మోటార్ల ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నామని వివరించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షపీ ఉల్లాలు ఉన్నారు.


పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 1: రైతులు మధ్య దళారులను ఆశ్రయించి మోసపోవద్దని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి రైతు వేదిక దగ్గర వరి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రైతుకు ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. వరి ఏ గ్రేడ్ రకం రూ.2203, బీ గ్రేడ్ రకం రూ.2183ధర నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యం విక్రయించే రైతులు భూమి పాస్‌బుక్, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు ఏఈవో పంట సాగు ధ్రువీకరణపత్రం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణబాయి, జిల్లా అధికారి రాజేశ్వర్, రాంరెడ్డి, సివిల్ సప్లయి అధికారి లక్ష్మణ్, మండల డిప్యూటీ తహసీల్దార్ రవి, మండల వ్యవసాయ అధికారి తిప్పేస్వామి, నాగిరెడ్డిపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక, వీవోఏ రాంచంద్రయ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు సంగీత, రైతులు పాల్గొన్నారు.

దశల వారీగా అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలు

కులకచర్ల: దశలవారీగా జిల్లాలోని అన్ని మండలాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పౌర సరఫరాల శాఖ డీఎం సుగుణబాయి, డీఎస్‌వో రాజేశ్వర్ తెలిపారు. కులకచర్లలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం వరి క్వింటాలుకు ఎగ్రేడ్ రకం రూ.2203, కామన్ గ్రేడ్ రూ.2183గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 122 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. పంట తీసిన రైతులు ధాన్యం ఆరబెట్టుకొని చెత్త, తాలు వేరు చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. మధ్యదళారులకు ధాన్యం అమ్మకూడదన్నారు. కేంద్రం నిర్వాహకులు ధాన్యాన్ని జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం రామ్మూర్తి, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీయం శోభ, సీసీ వెంకటయ్య, డ్వాక్రా సంఘాల మహిళలు, రైతులు పాల్గొన్నారు.


నాగిరెడ్డిపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ధర్మ సంస్థాపనే లక్ష్యంగా కృషి చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 1: ధర్మ సంస్థాపనే లక్ష్యంగా కృషి చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆలంపల్లి కెంపిన మఠం పూర్వ పీఠాధిపతి దివంగత శంకరస్వాముల పుణ్య సంస్మరణోత్సవం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ పరిషత్ ఉపాధ్యక్షుడు మఠపతి సాంబశివశర్మ ఆధ్వర్యంలో షట్‌స్థల ధ్వజారోహణం, శంకరప్రభు మహాస్వామి గురు పీఠానికి మహా రుద్రాభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుభప్రద్‌పటేల్ మాట్లాడుతూ.. ధర్మాన్ని ఎవరు కాపాడుతారో వారిని ధర్మం కాపాడుతుందన్నారు. ధర్మాల్లో హిందూ ధర్మం ఎంతో గొప్పదని, మహాత్మా బసవేశ్వరుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. ఆధ్యాత్మిక చింతనలో శంకరస్వాములు తనకంటూ ఓ ప్రత్యేకత నిలుపుకొన్నారని, తాను నేర్చుకున్న విద్యను ఇతరులకు బోధించి ఎంతో మందిని విద్యావంతులను చేశారని ఆయన గుర్తుచేశారు. దుద్దిని పీఠాధిపతి చెన్నబసవప్రభు మహాస్వామి మాట్లాడుతూ. ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ఎలాంటి కష్టాలు ఎదురైనా ధర్మాన్నే ఆచరించాలన్నారు. తంగెడుపల్లి శివయోగి శివాచార్యస్వామి మాట్లాడుతూ.. ధర్మాన్ని ఆచరించే వారు తగ్గుతున్నారని, వీరి సంఖ్య పెరగాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన చెప్పారు. ముఖ్య వక్తగా హాజరైన పోలె విశ్వనాథం మాట్లాడుతూ.. శంకరప్రభు స్వాముల సేవా కార్యక్రమాలు, హిందూధర్మం విశిష్టతను వివరించారు. అనంతరం కత్తెపల్లి సచ్చిదానంద షట్‌స్థల పీఠ సంస్థాపకులు ఉమాపతయ్య స్వామి రచించిన ఏకేశ్వరోపాసన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీరశైవ సమాజం అధ్యక్షుడు విజయకుమార్, నూలి బసవలింగం పటేల్, ఆత్మలింగం, చెక్క వీరన్న, రామలింగంస్వామి, చంద్రశేఖరస్వామి, పార్వతయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శుభప్రద్ పటేల్



చెట్టినాడు రైల్వే ట్రాక్ తొలగింపు

- రైతులకు చెల్లించని పరిహారం
- ట్రాక్‌ను తొలగించిన కాంట్రాక్టర్, రైతులు

తాండూరురూరల్, ఏప్రిల్ 1 : తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కల్లూరు సమీపంలో గల చెట్టినాడు సిమెంట్ కర్మాగారం రైల్వే ట్రాక్‌ను కాంట్రాక్టర్, రైతులు తొలగించారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలంలోని బెల్కటూర్, మిట్టబాస్పల్లి, గుంతబాస్పల్లి, కోటబాస్పల్లి, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామ శివారులోని పొలాల మీదుగా రైల్వే ట్రాక్‌ను నిర్మించారు. బెల్కటూర్ నుంచి చెట్టినాడు ఫ్యాక్టరీ గేటు వరకు 11 కిలో మీటర్ల మేర రైల్వేట్రాక్ నిర్మాణం చేశారు. ఈ ట్రాక్ నిర్మాణం రెండేళ్ల క్రితం పూర్తయింది. కర్మాగారం యాజమాన్యం పరిహారం చెల్లించాలని రైతులు జనార్ధన్‌రెడ్డి, కృష్ణవేణి, రాజారాం, శంకర్ సదరు కాంట్రాక్టర్ ప్రసాద్‌కుమార్‌కు కోరారు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిహారం ఇవ్వకపోవడం ఏమిటని కాంట్రాక్టర్ నిలదీశారు. అయితే చెట్టినాడు యాజమాన్యం రూ.18 కోట్ల వరకు బకాయిలు చెల్లించలేదని, అందుకు రైతులకు పరిహారం ఇవ్వడం ఆలస్యమైందని కాంట్రాక్టర్ రైతులకు తెలిపారు. దీంతో కాంట్రాక్టర్‌తో పాటు రైతులు కలిసి కోటబాస్పల్లి శివారులోని సర్వేనెంబర్-68లో ఉన్న రైల్వే ట్రాక్‌ను కార్మికుల సహాయంతో తొలగించారు. అనేకసార్లు కర్మాగారం యాజమాన్యానికి పరిహారం కోసం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్, రైతులు తెలిపారు. గతంలో రెండుసార్లు కూడా రైల్వే ట్రాక్‌ను కాంట్రాక్టర్ తొలగించాడు. ఈ విషయమై చెట్టినాడు సిమెంటు కర్మాగారం ప్రతినిధిని వివరణ కోరగా, కాంట్రాక్టర్‌తో యాజమాన్యం మాట్లాడే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. సమస్య పరిష్కారించేందుకు యాజమాన్యం కూడా ప్రయత్నిస్తుందని వివరణ ఇచ్చారు. సిమెంటు తీసుకెళ్లేందుకు తాము రైల్వే అధికారులకు రిక్వెస్ట్ లెటర్ పెట్టిన తర్వాతనే రైల్వే అధికారులు గూడ్స్ వ్యాగిన్ పంపిస్తారని చెప్పారు.

ఉనికి కోసమే కేసీఆర్ నీచ రాజకీయాలు

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి

ఆమనగల్లు, ఏప్రిల్ 1 : అవినీతి, అరాచక పాలనతో అధికారం కోల్పోయిన మాజీ సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో ఉనికి కోసం నీచ రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. ప్రకృతి వైపరిత్యాలు, వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ పదేళ్ల బీఆర్ఎస్ అవినీతి, పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరిత్యాల కారణంగా ఇబ్బందులు పడుతున్న, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలు, వైఫల్యాలు సరిచేస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాభివృద్ధికి చేపడుతున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని చెప్పారు. అవినీతికేసుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రైతులను, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం సాగిస్తున్నారని మండిపడ్డారు. ఉచిత విద్యుత్ పేరుతో పొరుగు రాష్ట్రాల నుంచి అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి బీఆర్ఎస్ సర్కార్ అందినంత దండుకుందని, కాళేశ్వరం, మేడిగడ్డ బ్యారేజీల వైఫల్యానికి కేసీఆర్ కారణం కాదా అని ఆయన ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని, 14 ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటుందని మల్లు రవి చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు వస్పుల జంగయ్య, గుర్రం కేశవులు, మదు, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, నాయకులు శ్రీకాంత్, శ్రీశైలం, ఉన్నారు.


విలేఖరులతో మాట్లాడుతున్న మల్లు రవి


మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకి ఓటేయాలి

యాలాల, ఏప్రిల్ 1: దేశం సురక్షితంగా ఉండాలంటే బీజేపీకి ఓటు వేయాలని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని రాస్నం, పగిడ్యాల్, బాగేపల్లి, రాఘవపూర్, కోకట్, లక్ష్మీనారాయణపూర్, అక్కంపల్లి, జుంటుపల్లి, అగ్గనూరు, తదితర గ్రామాల్లో బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటి వరకు బీజేపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటి వరకు చేసిందేమీ లేదన్నారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో ఎక్కడ చూసినా బీజేపీ ప్రభంజనం కనిపిస్తోందని అన్నారు. ప్రతీ గ్రామంలో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, యాలాల మండల శాఖ అధ్యక్షుడు జంగం యాదగిరి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, యు.రమేష్, నాగయ్యగౌడ్, మధుగౌడ్, అరుణ్ కుమార్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే విజయం

బషీరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీదే విజయమని, క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలని ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాశీంపూర్, గొట్టిగఖుర్దు, నవాల్గ, మర్పల్లి తదితర గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్రను సోమవారం సాయంత్రం నిర్వహించారు. దేశం అన్ని రంగాల్లో ముందుకెళ్లాలంటే మరోసారి మోదీని ప్రధానిగా గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత యు.రమేష్‌కుమార్, సీనియర్ నాయకులు మనోహర్ రావు, ఎం.నరేష్, బాలేశ్వర్‌గుప్తా, రాజ్‌కుమార్ కులకర్ణి, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, బీజేవైఎం మండలాధ్యక్షుడు ప్రశాంత్, గంగాధర్, జగన్ ముదిరాజ్, మంతట్టి హన్మంత్‌రెడ్డి, సంగాయిపల్లి కాశీరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ఎన్నికల నియామావళిని ఉల్లంఘిస్తే చర్యలు

కొడంగల్, ఏప్రిల్ 1: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియామావళి, నామినేషన్లు, పోలింగ్ ప్రక్రియ తదితర వాటిపై అవగాహన కల్పించారు. పార్లమెంట్ ఎన్నికలకు కొడంగల్ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్, కొడంగల్, మద్దూర్ మండలాల తహసీల్దార్లు పద్మావతి, దానయ్య, సి.విజయ్‌కుమార్, బి.విజయ్ కుమార్, మహేశ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు సురేశ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కోటిరెడ్డి

పోలీస్ శిక్షణ కాలం ఎంతో విలువైంది

- వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 1: పోలీస్ శిక్షణ కాలం ఎంతో విలువైనదని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 280మంది మహిళా అభ్యర్థులు శిక్షణ నిమిత్తం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారితో ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ అధికారులు శిక్షణ కాలంలో నిర్లక్ష్యం చేయకుండా క్రమశిక్షణ, ఏకాగ్రతతో శిక్షణలో చెప్పే విషయాలను నేర్చుకోవాలని సూచించారు. సమయం వృథాకాకుండా శిక్షణ సమయంలో చెప్పే విషయాలను శ్రద్ధగా నేర్చుకోవాలన్నారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న ప్రతీ ఒక్క అంశం సర్వీస్ కాలంలో ఉపయోగపడుతుందన్నారు. అభ్యర్థులు టెక్నికల్ విషయాలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఏఈవో జోతిర్మనీ, ఏఆర్ డీఎస్పీ వీరేశం, అకాడమి నుంచి వచ్చిన అధికారులు ప్రాక్టికల్‌గా పలు విషయాలను వివరించారు.

3.5 లక్షల విలువైన 14 కిలోల గంజాయి స్వాధీనం

- కోణార్క్‌ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి తరలింపు

వికారాబాద్, ఏప్రిల్ 1: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం వికారాబాద్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో రూ. 3.50 లక్షల విలువ గల 14 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులు మనోజ్ పరమర్, అనిల్‌ఉపాధ్యాయ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసు అధికారులు తెలిపారు. ప్రధానంగా రైళ్లలో గంజాయి సరఫరా జరుగుతుందన్న సమాచారంతో వివిధ రైల్వే స్టేషన్లలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న గ్రామస్థులు

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కందుకూరు, ఏప్రిల్ 1 : మండలం పరిధి నేదునూరు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదా, పద్మావతి, సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మార్చి 30 నుంచి రేపటి వరకు ఆలయ ధర్మకర్త కాసుల అంజిరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం స్వామి వారి కల్యాణాన్ని వేద పండితులు వట్టిపల్లి రామశర్మ నిర్వహించారు. కల్యాణంలో నేదునూరు, మాన్యగూడ గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల మహిళలు, భక్తులు పాల్గొని స్వామి వారికి తలంబ్రాలు తీసుకువచ్చారు. అంతకు ముందు బ్యాండు వాయిద్యాల నడుమ ఉత్సవ విగ్రహాలను నిర్వాహకులు మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకు వచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాసుల రామక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉన్ని వెంకటయ్య, నాయకులు సోలిపేట అమరేందర్‌రెడ్డి, గంగుల ప్రభాకర్‌రెడ్డి, చందా భాస్కర్, కొత్తకాపు ప్రభాకర్‌రెడ్డి, నామని చంద్రప్రకాశ్, సోలిపేట రంగారెడ్డి, బానాల జైపాల్‌రెడ్డి, సోలిపేట స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

వికారాబాద్, ఏప్రిల్ 1: మండల కేంద్రంలో గల అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సీడబ్ల్యూసీ అధికారిని సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ విచారణ చేపడతామని ప్రజా సంఘాల బృందం సభ్యులకు హామీ ఇచ్చారు. సీడబ్ల్యూసీ స్పందిస్తూ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై పూర్తి విచారణకు కమిటీని వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు శివరాజ్, వైగీత, మల్లేష్ మాట్లాడుతూ.. హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించి హాస్టల్ నిర్లక్ష్యానికి కారణమైన అధికారులపైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈహాస్టల్‌ను వికారాబాద్ జిల్లా కేంద్రంలోకి మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు శ్రీనివాస్, వెంకటయ్య రాములు, ఆశా ఉమాయాదయ్య పాల్గొన్నారు.

8 నుంచి సమ్మెటీవ్ పరీక్షలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 8వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సమ్మెటీవ్ అసిస్మెంట్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈవో వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1 నుంచి 7వ తరగతి వరకు ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి 11.45గంటల వరకు, 9వ తరగతి కి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఈనెల 23వ తేదీ పాఠశాలలకు చివరి పనిదినం అని ఎంఈవో వెల్లడించారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

● ఎంపీడీవో విశ్వప్రసాద్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు రూరల్, ఏప్రిల్ 1: తాండూరు మండలం మల్కాపూర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీవో విశ్వప్రసాద్ హామీ ఇచ్చారు. 'మల్కాపూర్‌లో తాగునీటి ఎద్దడి' అనే శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు మల్కాపూర్‌లోని 1, 2వ వార్డుల్లో తాగు నీటి సమస్యపై తాండూరు మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్‌తో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. బోరు మోటారు మరమ్మతుకు గురైనందున నీటిసమస్య ఏర్పడిందని, వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామన్నారు. నేటి(మంగళవారం) నుంచి ఆయా వార్డుల్లో నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. కాలనీవాసులు ఇబ్బందులు పడకుండా పంచాయతీ ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా చేస్తామని చెప్పారు. వేసవి దృష్ట్యా అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించడం జరిగిందన్నారు. అనంతరం మల్కాపూర్‌లోని వాటర్ ట్యాంకును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీటీసీ రవిసింధే, నాయకులు పండరి, హసన్‌పటేల్ తదితరులున్నారు.



మల్కాపూర్‌లో వాటర్ ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీవో

3డీ ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన ఉండాలి

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 1: 3డీ ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన ఉండవాలని అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ హెచ్‌వోడీ శ్రీనివాస చలపతి తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో సోమవారం ప్రింటింగ్ టెక్నాలజీస్‌పై జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు 3డీ ప్రింటింగ్ టెక్నాలజీస్‌పై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ప్రింటింగ్ అప్లికేషన్‌లో మెళుకువలను నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కొత్త కొత్త డిజైన్ మోడల్స్‌ను ఎంచుకోవాలని, అప్పుడే ప్రింటింగ్ టెక్నాలజీస్‌లో వైవిధ్యం తెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జషకుమార్, శ్రీనివాస్‌లు, శ్రవణ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అనురాగ్ యూనివర్సిటీలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీస్‌పై జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

క్రైం కార్నర్

కన్నతండ్రిపై కత్తితో దాడి

● ప్రాణపాయస్థితిలో అనంతయ్య

● ఆస్తికోసం ఘాతుకానికి ఒడిగట్టిన కొడుకు

బంట్వారం(కోట్‌పల్లి), ఏప్రిల్ 1: ఆస్తి కోసం కన్నతండ్రినే కడతేర్చాలని కొడుకు కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వికారాబాద్ నియోజకవర్గం కోట్‌పల్లి మండలంలోని బీరోల్ గ్రామానికి చెందిన తాంద్ర అనంతయ్య(48), భార్య ప్రమీల దంపతులు. వీరికి కుమారుడు రమేష్, కూతురు ఉన్నారు. అయితే అనంతయ్య దివ్యాంగుడు కాగా గ్రామంలోనే తన అన్న వద్ద ఉంటుండగా భార్య ప్రమీల, ఆమె కూతురు వికారాబాద్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు రమేష్ మాత్రం మద్యానికి బానిసై ఉన్న పొలాన్నీ గతంలోనే అమ్మేశాడు. ప్రస్తుతం తండ్రికి వచ్చే పింఛన్ డబ్బులతో పాటు మిగితా ఆస్తి (లావాణి భూమి)తో పాటు ఇల్లును అమ్మేందుకు రమేష్ ప్రయత్నించాడు. దీంతో తండ్రి మందలించి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో రమేష్ వికారా బాద్ వచ్చిన తన తండ్రిని గ్రామానికి వెళ్దామని ఆటోలో తీసుకెళ్తూ మార్గమధ్యలో తనతండ్రిని ఆటో నుంచి లాగి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోశాడు. గమనించిన తోటి ప్రయాణికులు అరిచేసరికి అక్కడి నుంచి పరారయ్యాడు. 108లో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యులు హైదరాబాద్ రెఫర్ చేశారు. బాధితుడి భార్య ప్రమీల ఫిర్యాదు నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోట్‌పల్లి ఎస్ఐ స్రవంతి తెలిపారు.



నిందితుడు రమేష్

చేపల వేటకు వెళ్లి చెరువులో వ్యక్తి గల్లంతు



కొనసాగుతున్న గాలింపు చర్యలు



చెరువు వద్ద గుమిగూడిన గ్రామస్తులు

వికారాబాద్, ఏప్రిల్ 1: చేపల వేట కోసం వెళ్లి చెరువులో ఈత కొడుతుండగా ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ ఘటన వికారాబాద్ మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎర్కల అనంతయ్య(60) సోమవారం మధ్యాహ్నం అదే గ్రామంలోని చెరువులో చేపలవేట కోసం వెళ్లాడు. చేపలు పట్టిన అనంతరం ఒడ్డుకు వచ్చిన అనంతయ్య మళ్లీ చెరువులో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లి ఈత కొట్టాడు. చెరువులో ఒడ్డుకు వెళ్లేందుకు ప్రయత్నించిన అనంతయ్య ఊపిరాడక నీటిలో మునిగిపోయాడు. గమనించిన గ్రామస్తులు వెంటనే కాపాడేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పోలీసులుకు సమాచారం అందించగా పోలీసులు, ఫైర్‌సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. కోట్‌పల్లి నుంచి బోట్ తెప్పించడంతో పాటు గజ ఈతగాళ్లను రంగంలోకి దింపినా సాయంత్రం వరకూ ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది గ్రామస్తులు అనంతయ్య కోసం గాలింపు ముమ్మరం చేశారు. అనంతయ్య గంపలు అల్లుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య వెంకటమ్మ, కుమారుడు, కూతుళ్లు ఉన్నారు.

వీబీఐటీ కళాశాలలో రెండు ప్రాజెక్టర్లు చోరీ

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 1: ఓ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు ఎస్‌సీడీ ప్రాజెక్టర్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. అవుషాపూర్ విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాలలోని ఆకాష్ బ్లాక్‌లో గతనెల 30వ తేదీన రెండు ఎల్‌సీడీ ప్రాజెక్టర్లు చోరీకి గురయ్యాయని, ప్రిన్సిపాల్ వీవీసీ శ్రీనివాస్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కళాశాలకు చేరుకున్న పోలీసులు ప్రాజెక్టర్లు చోరీకి గురైన తీరును పరిశీలించారు. అపహరణకు గురైన ప్రాజెక్టర్ల విలువ రూ.40వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

తాండూరురూరల్, ఏప్రిల్ 1: తాండూరు మండల పరిధిలో జరుగుతున్న ఓ బాల్యవివాహాన్ని కరన్‌కోట్ పోలీసులు అడ్డుకున్నారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోటబాస్పల్లికి చెందిన అబ్బాయితో కర్నాటక రాష్ట్రం చించొళి తాలూకా మిర్యాణ్‌కు అమ్మాయితో సోమవారం వివాహం జరిపేందుకు కుటుంబీకులు నిర్ణయించారు. కోటబాస్పల్లిలో బాల్య వివాహం జరుగుతున్నట్లు కరన్‌కోట్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం చైల్డ్‌లైన్ కమిటీ వద్దకు పంపినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అబ్బాయిలు, అమ్మాయిలకు పెళ్లి వయస్సు రాకుండా బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

పేదలను ఆదుకుంటాం



నిత్యావసర కిట్లను పంపిణీ చేస్తున్న సయ్యద్ ఇక్బాల్

వికారాబాద్, ఏప్రిల్ 1: పేదలకు ఆదుకుంటామని శివారెడ్డిపేట్ వాసి,ప్రముఖ వ్యాపార వేత్త సయ్యద్‌ఇక్బాల్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ఏ ముస్లిం కుటుంబాలు ఆకలితో ఉండొద్దనే ఉదేశ్యంతో ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపేట్‌లో ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఆరు సంవత్సరాలుగా ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ముస్లింలకు కిట్ల పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సారి 1400 కిట్లను పంపిణీ చేశామని చెప్పారు. ఈకిట్లలో కుటుంబంలో 30 మందికి సరిపడా వస్తువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డిపేట్ ముస్లిం వాసులు పాల్గొన్నారు.

వరిలో కాండం తొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలి



గట్టేపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న ఎఈవో

ధారూరు, ఏప్రిల్1: వరి పంటలో కాండం తొలుచుపురుగు ఆశించిందని, రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని ధారూరు ఎఈవో సంజూ రాథోడ్ తెలిపారు. మండల పరిధిలోని గట్టేపల్లి గ్రామంలో సోమవారం ఆయన వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి ఈనే దశలో కాండం తొలుచు పురుగు ఆశించటం వల్ల పంటకు నష్టం వాటిల్లుతుందని చెప్పారు. వరి మొక్క ఆకు కింది బాగంలో పురుగు గుడ్డు పెడుతుందని, కాబట్టి కొనలను తుంచి వేయాలని ఆయన సూచించారు. వరి కంకులు పాలుపోసుకునే దశలో కాండం తొలుచు పురుగు ఆశిస్తే గింజలు తాలుపోయి దిగుబడి దెబ్బతింటుందని ఆయన చెప్పారు. దీని నివారణకు గాను ఎకరానికి 10 కిలోల 3జీ గుళికల మందును వరి పంటలో చల్లుకోవాలని, లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును ఎకరానికి 400 గ్రాములు నీటిలో కలిపి పంటపై పిచికారి చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ అర్చకులు

కొడంగల్, ఏప్రిల్ 1: కోస్గిలో గల శ్రీ ఇంద్రనీలేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు మఠం అంపయ్య స్వామి ఆధ్వర్యంలో సోమవారం రుద్రాభిషేకం, చండీహవనం తదితర పూజలు నిర్వహించారు. నంద్యాల వాస్తవ్యులు బ్రహ్మశ్రీ శశిభూషణ సిద్ధాంతితో గణించబడిన పంచాంగం జంగం సమాజం గౌరవ అధ్యక్షుడు రుమాళ్ల మల్లికార్జున్, అధ్యక్షుడు అంపయ్య, నారాయణపేట జిల్లా కన్వీనర్ మఠం అమరలింగస్వామి, జంగం అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు మహేశ్‌స్వామి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సారంగధర మఠం మల్లికార్జున్, వినయ్‌స్వామి, మఠం విశ్వనాథ్, మఠం జగదీశ్ పాల్గొన్నారు. కోస్గికి చెందిన బిచ సుభాష్ దంపతులు చండీహోమం నిర్వహించారు.

గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలి

యాలాల, ఏప్రిల్ 1: మండలంలోని కాగ్నా వాగు నుంచి కొడంగల్‌కు తరలించే తాగునీటిని యాలాల మండలంలోని తొమ్మిది గ్రామాలకు సరఫరా చేయాలని యాలాల మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీనారాయణపూర్ గ్రామంలో సోమవారం పార్టీ మండల నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కాగ్నా వాగు నుంచి కొడంగల్, దాని చుట్టు పక్కల గ్రామాలకు తాగు నీటిని అందించే వారని చెప్పారు. అయితే యాలాల మండలం పరిధిలో గల లక్ష్మీనారాయణపూర్, అగ్గనూర్, చెన్నారం, దౌలాపూర్, గిర్మాపూర్, అక్కంపల్లి, జుంటుపల్లి, బండమీదిపల్లి, మల్‌రెడ్డి గ్రామాలకు ఇదే పైప్‌లైన్ ద్వారా తాగు నీటిని అందించే వారని చెప్పారు. రెండు సంవత్సరాలుగా ఈ తొమ్మిది గ్రామాలకు తాగునీటి సరఫరాను అధికారులు నిలిపివేశారని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని యథావిధిగా తొమ్మిది గ్రామాలకు తాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగ్నా నుంచి కొడంగల్‌కు తరలించే పైపులైన్‌లకు ఈ తొమ్మిది గ్రామాలకు నీరనందించే పైపులు ప్రస్తుతం ఎప్పటిలాగే ఉన్నాయని చెప్పారు. అదేవిధంగా యాలాల మండలంలోని తొమ్మిది గ్రామాలకూ తాగు నీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఈ విషయంలో కలెక్టర్, తాండూరు ఎమ్మెల్యే స్పందించాలని లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వడ్డె రాములు, శివకుమార్, లక్ష్మీనారాయణ, అరవింద్ కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణకుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జగ్జీవన్‌రాం విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

తాండూరు రూరల్, ఏప్రిల్ 1: భారత ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రాం విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ తాండూరు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్, దళితసంఘాల నాయకులు కమిషనర్‌ను సోమవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు మాదిగ మాట్లాడుతూ.. దేశ అభ్యున్నతికి పాటుపడిన జగ్జీవన్ రాం విగ్రహ ఏర్పాటుకు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డుమార్గంలో స్థలం కేటాయించాలని కోరారు. అధికారులు చొరవచూపి స్థలం కేటాయిస్తే ఈనెల 5వ తేదీన జగ్జీవన్‌రాం జయంతి ఉన్నందున ఏర్పాట్లు చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామిదాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ప్రకాష్, కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ప్రమాదకరంగా కల్వర్టు

కులకచర్ల, ఏప్రిల్ 1: కులకచర్ల నుంచి బండవెల్కిచర్ల వెళ్లే దారిలో బొంరెడ్డిపల్లి గేటు సమీపంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టుకు రెండువైపులా గోడలు నిర్మించకపోవడంతో తరచూప్రమాదాలు జరుగుతున్నాయి. పాంబండకు ఇదేదారిలో వెళ్లాల్సి ఉంటుంది. రోడ్డు పక్కనే కల్వర్టు ఉండటంతో గమనించని వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మరోమారు ప్రమాదం జరగకముందే కల్వర్టు దగ్గర హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



కులకచర్ల-బండవెల్కిచర్ల దారిలో ప్రమాదకరంగా కల్వర్టు

పార్కు స్థలాన్ని కాపాడాలి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 1: పార్కుస్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడి, ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోచారం మున్సిపల్, అన్నోజిగూడ సాయినగర్ కాలనీవాసులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అన్నోజిగూడ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 17, 47ల్లోని ప్లాట్ నెంబర్లు 43, 44 మధ్యలో పార్కుస్థలం ఉందని, ఇట్టిస్థలాన్ని కొందరు రియల్ వ్యాపారులు ఆక్రమణకు గురిచేస్తున్నారని తెలిపారు. పార్కుస్థలాన్ని కబ్జాకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీరాం నరేష్, అమ్మిరెడ్డి బాల్‌రెడ్డి, భరత్‌కుమార్ తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

తల్లిదండ్రుల్లో ఎవరిని కోల్పోయినా ఉచిత విద్య

దోమ, ఏప్రిల్ 1: తల్లిదండ్రుల్లో ఎవరిని కోల్పోయినా వారికి 1 నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత విద్యతో పాటు భోజన వసతి సౌకర్యం ఉంటుందని దోమ మండల ఎంపీడీవో మహేశ్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటబాపల్లిలో 60ఎకరాల ప్రదేశంలో హిల్ ప్యారడైస్ పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1 నుంచి ఇంటర్మీడియేట్ వరకు సీబీఎస్ సిలిబస్ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందన్నారు. ఈ పాఠశాలలో ఏ రాష్ట్రమైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 15 వరకు దరఖాస్తుకు చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100024438, 910024435 సెల్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయం



చలివేంద్రం ప్రారంభిస్తున్న కౌన్సిలర్

మేడ్చల్ టౌన్ ఏప్రిల్ 1: చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయమని మేడ్చల్ మున్సిపల్ 3వ, వార్డు కౌన్సిలర్ జాకట దేవరాజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని రాఘవేందర్ నగర్ కాలనీలో శక్తి యువజన సంఘం వారు ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, శక్తి యువజన సంఘం నేతలు పాల్గొన్నారు.

మేడ్చల్: శామీర్‌పేట మండలం అలియాబాద్ చౌరస్తా వద్ద శ్రీరామ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమృత చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ శామీర్‌పేట మండల నాయకుడు కంటం కృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

గోశాల నూతన కార్యవర్గం



తాండూరు గోశాల నూతన కార్యవర్గం

తాండూరు, ఏప్రిల్ 1: తాండూరు గోశాల నూతన అధ్యక్షుడిగా పట్లోళ్ల బాల్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోశాల అధ్యక్షుడిగా సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. గోశాల సేవా సమితి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గోశాల సేవా సమితి సభ్యులతో కలిసి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

వికారాబాద్, ఏప్రిల్ 1: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతీఒక్కరు కృషి చేయాలని పార్టీ నవాబుపేట మండల అధ్యక్షుడు నాగిరెడ్డి అన్నారు. చేవెళ్లలోని కేసీఆర్ గార్డెన్‌లో సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో పార్టీ అభ్యర్థి గెలుపునకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిట్టెపు మల్లారెడ్డి, ప్రభాకర్, ఆనంద్‌రెడ్డి, తలారి అజయ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు నాలం ప్రకాశం, ఎంపీటీసీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగిరెడ్డి

బీజేపీ మండల ఇన్‌చార్జిగా రామకృష్ణారెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 1: నవాబుపేట మండల బీజేపీ పార్టీ ఇన్‌చార్జిగా సోమనోల్ల రామకృష్ణారెడ్డిని చేవేళ్ల నియోజవకర్గ మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మాధవరెడ్డి సోమవారం అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపైన మ్మకంఉంచి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవేళ్ల అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సంగపూర్ రమేశ్, వికారాబాద్ జిల్లా కార్యదర్శి సారా జగన్, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గాలయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షుడితో రామకృష్ణారెడ్డి

సంక్షిప్తంగా..

● **తాండూరు రూరల్:** మహనీయుల జయంతి ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహించుకుందామని దళిత ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. తాండూరులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప సోమవారం సమావేశమై మాట్లాడారు. ఈనెల 5న బాబు జగ్జీవన్‌రాం, 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఉన్నాయని, అధికారులు కూడా అధికారికంగా నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. **పరిగి:** పరిగి మునిసిపల్ పరిధిలో వ్యాపారస్తులు, చిరువ్యాపారులు, రైతులు తై బజారుకు డబ్బులు చెల్లించరాదని పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. తై బజార్ కాలపరిమితి మార్చి 31 వరకే గడువు ముగిసిందని తెలిపారు. ఎవరూ కూడా తై బజార్‌కు డబ్బులు చెల్లించరాదని సూచించారు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. మునిసిపల్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

బషీరాబాద్: బషీరాబాద్ ఎంపీడీవో కార్యాలయం ఆఫీస్ సబార్డినెట్‌గా పనిచేస్తున్న జలీల్‌పాషా(31) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈమరణ వార్త తెలుసుకున్న కార్యాలయం అధికార సిబ్బంది సోమవారం ఉదయం తాండూరు మండలం గౌతాపూర్‌లోని మృతుడి ఇంటికివెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబానికి డిపార్ట్‌మెంట్ తరపున తక్షణసాయంగా అంత్యక్రియలకు రూ.20వేలను ఎంపీవో రమేష్ అందజేశారు. ఆయన వెంట సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ షేర్‌ఖాన్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

మేడ్చల్, ఏప్రిల్ 1: అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వేన్షన్‌హాల్‌లో మంగళవారం ఉదయం 10.30గంటలకు మేడ్చల్ నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడ సుదర్శన్ తెలిపారు. సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పార్టీ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్), మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానికి బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డిలు విచ్చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సమావేశానికి శామీర్‌పేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ, పార్టీ అనుబంద సంఘాల నాయకులు, ఉద్యమకారులు, కార్యకర్తలు తప్పనిసరిగా విచ్చేసి కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని సుదర్శన్ పిలుపు నిచ్చారు.

మూడు చింతలపల్లి: నేడు మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని శామీర్‌పేట్ మండలం అలియాబాద్‌లోని సీఎంఆర్ కన్వేన్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్లు మూడుచింతలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు నిర్వహించే విస్తృతస్థాయి సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విచ్చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.